క్లుప్తంగా

ఘనంగా గౌరీపరమేశ్వరుల ఊరేగింపు



మునగపాకలో గౌరీపరమేశ్వరులను ఊరేగిస్తున్న భక్తులు

మునగపాక: మునగపాకలో సోమవారం రాత్రి గౌరీ పరమేశ్వరుల ఊరేగింపు ఘనంగా జరిగింది. గౌరీ పరమేశ్వరుల నిలుపు మహోత్సవంలో భాగంగా డప్పు వాయిద్యాల నడుమ ఈ ఊరేగింపు మెయిన్ రోడ్డు నుంచి ప్రారంభమై గ్రామంలోని అన్ని వీధుల మీదుగా వేపచెట్టు వద్ద ఉన్న ఆలయం వరకు సాగింది. పలువురు భక్తులు గౌరీ పరమేశ్వరులను దర్శించుకున్నారు. సర్పంచ్ దిమ్మల అప్పారావు, గౌరీ పరమేశ్వరుల ఆలయ కమిటీ చైర్మన్ పెంటకోట ఆదినారాయణ, కార్యదర్శి ఆడారి అప్పలనాయుడు, పెద్దలు పెంటకోట వెంకట్, టెక్కలి కొండలరావు, ఉత్సవ కమిటీ చైర్మన్ వేగి కృష్ణ, తదితరులు ఈ వేడుకలో పాల్గొన్నారు.

రీసర్వేలో లోపాల సవరణకు రెవెన్యూ సదస్సులు



రైతుల నుంచి దరఖాస్తు స్వీకరిస్తున్న తహసీల్దార్ ఆదిమహేశ్వరరావు

మునగపాక: రీసర్వేలో లోపాల సవరణకు రెవెన్యూ సదస్సులు దోహదపడతాయని తహసీల్దార్ ఎస్.ఆదిమహేశ్వరరావు తెలిపారు. మండలంలోని నాగులాపల్లిలో సోమవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 123 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. భూములకు సంబంధించి ఎటువంటి తేడాలున్నా వాటిని సరిచేసేందుకు అధికారులు అందుబాటులో ఉంటారన్నారు. సర్పంచ్ జామి చినమ్మలు, మాజీ సర్పంచ్ యల్లపు భాస్కరరావు, ఎంపీటీసీ మళ్ల కాశీ సురేష్, వార్డు సభ్యుడు సింగర్‌రాజు, రీ-ర్వే డీటీ పడాల్, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

నేడు కాకరాపల్లిలో రెవెన్యూ సదస్సు

మునగపాక: మండలంలోని కాకరాపల్లిలో మంగళవారం రెవెన్యూ సదస్సు జరగనుందని తహసీల్దార్ ఎస్.ఆదిమహేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. రీ-సర్వేలో లోపాలను సవరించేందుకు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సచివాలయ ప్రాంగణంలో జరిగే సదస్సును రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

8 నుంచి ప్రజాపోరు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

అనకాపల్లి: అధిక ధరలు, నిరుద్యోగం, మహిళలు, పిల్లలు, దళితులపై అత్యాచారాలు, జమిలి ఎన్నిక లు, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఈ నెల 8 నుంచి 14 వరకు రాష్ట్ర వ్యాప్తంగా ప్రజా పోరు పేరుతో ఇంటింటా ప్రచార కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం తెలిపారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ప్రజాపోరు పోస్టర్‌ను సోమవారం ఆయన ఆవిష్కరించి, విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 14న సచివాలయాల వద్ద, 15న మండల కార్యాలయాల వద్ద ధర్నాలు చేస్తామన్నారు. నిత్యావసర సరకులు, వంటనూనెలు, కూరగాయల ధరలు ఆకాశనంటుతున్నాయన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉద్యోగాలు వస్తాయని ఎదురుచూస్తున్న యువత నిరాశ చెందారన్నారు. రాష్ట్రంలో మహిళలు, పిల్లలపై, దళితులపై అత్యాచారాలు రోజురోజుకూ పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వ హామీలు అమలులోకి కాలేదని, అవినీతి విచ్చలవిడిగా సాగుతోందని, ఇసుక, మద్యం మాఫియాలు చెలరేగిపోతున్నాయన్నారు. జిల్లాలోని పరిశ్రమల్లో స్థానికులకు 75 శాతం ఉద్యోగాలు కల్పించాలని, రైతుల పంటలకు పెట్టుబడికి 50 శాతం అదనంగా కలిపి గిట్టుబాటు ధర కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగ వ్యతిరేక చర్యలకు తెలుగుదేశం పార్టీ మద్దతివ్వడం దారుణమన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.అప్పలరాజు, జి.కోటేశ్వరరావు, డి.వెంకన్న, గంటా శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి కష్టాలు తప్పవా?

- అధ్వానంగా కాలువలు
- పంట పొలాలకు అందని నీరు
- పట్టించుకోని అధికారులు



అధ్వానంగా దర్శనమిస్తున్న అరబుపాలెంలో సాగునీటి కాలువ



మునగపాకలోని కృష్ణంరాజు కాలువ దుస్థితి

మునగపాక: పిచ్చి మొక్కలు, చెత్తా చెదారాలతో మునగపాక మండలంలో సాగునీటి కాలువలు అధ్వానంగా తయారయ్యాయి. దీంతో ఏటా రైతులకు సాగునీటి కష్టాలు తప్పడం లేదు. నీటి పారుదల శాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగా పలువురు రైతులు పంటల సాగుపై నిరాసక్తి కనబరుస్తున్నారంటే అతిశయోక్తికాదు. సాగునీటి వనరులపై దృష్టి సారించాల్సి ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. ఫలితంగా చెరకు సాగు తగ్గుతూ వస్తోంది. వరిసాగు చేసే రైతులు కూడా కాలువలను చూసి విస్తుపోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. మండలంలోని పంటల సాగుకు కాలువలే ఆధారం. చెరకు, వరితో పాటు ఇతర పంటల సాగుపై రైతులు దృష్టి సారిస్తుంటారు. ఏటా సాగునీటి కాలువలను అభివృద్ధి చేయాల్సి ఉంటుంది. అయితే ఈ ప్రక్రియ సజావుగా జరగకపోవడంతో పంటలకు సకాలంలో నీరు అందడం లేదు. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. సీజన్‌కు ముందు నుంచి అధికారులు సాగునీటి కాలువల అభివృద్ధిపై దృష్టి సారించాల్సి ఉన్నా అటువంటి చర్యలు చేపట్టడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి.

మండలంలో సాగు సాధారణ విస్తీర్ణం

మండల వ్యాప్తంగా పలు రకాల పంటల సాగు విస్తీర్ణం 4123 హెక్టార్లుగా ఉంది. చెరకు తోటకు తెగుళ్ల సోకడం, వరికి సకాలంలో సాగునీరు అందకపోవడంతో విస్తీర్ణం తగ్గుతూ వస్తోంది. ప్రస్తుతం వరి 1465 హెక్టార్లకు పైగా సాగు జరుగుతుంది. చెరకు మాత్రం 604 హెక్టార్లకు మించి సాగు జరగడం లేదు. మండలంలోని సాగునీటి కాలువలు తమ స్వరూపాన్ని కోల్పోతున్నాయి. నాగులాపల్లి, ఉమ్మలాడ, అరబుపాలెం, మునగపాక, పాటిపల్లి తదితర ప్రాంతాల్లోని సాగునీటి కాలువల్లో పిచ్చి మొక్కలు పేరుకుపోయాయి. తూటిగడ్డి ఎక్కువగా వ్యాప్తి చెందడంతో పాటు మురుగునీరు కాలువల్లో ప్రవహించడంతో సాగునీటి ప్రవాహానికి అంతరాయం కలుగుతోంది. సాగునీటి కాలువల ద్వారా నీరు వచ్చే పరిస్థితులు అంతగా లేకపోవడంతో రైతులు పంటల సాగుపై ఆసక్తి కనబరచడం లేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

నీటి ప్రవాహానికి ఆటంకాలు



అరబుపాలెం వద్ద సాగునీటి కాలువ అధ్వానంగా ఉంది. కాలువలో మురుగునీరు ప్రవహిస్తుంది. పిచ్చి తుప్పలు పెరిగిపోవడంతో ఎగువ నుంచి దిగువ ప్రాంతానికి నీరు ప్రవహించే పరిస్థితులు కనిపించడం లేదు. అధికారులకు పలు మార్లు విన్నవించినా ఫలితం లేదు. వరికి సంబంధించి ప్రస్తుతం సాగునీరు అవసరం. అయినా నీటి సరఫరా లేదు.

– ఆడారి సత్యనారాయణ, రైతు, మునగపాక

అధికారులు చొరవ చూపాలి



నీటి పారుదల శాఖ అధికారులు సాగునీటి వనరులపై దృష్టి సారించాలి. కాలువలు అధ్వానంగా కనిపిస్తున్నాయి. కాలువల్లో తూటికాడ పెరిగిపోవడం, ఆక్రమణల కారణంగా రైతులకు కష్టాలు తప్పడం లేదు. అధికారులు ప్రత్యేక చొరవ చూపి సాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలి.

– కాండ్రేగుల కిరణ్‌కుమార్, రైతు, చూచుకొండ

ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం..

సాగునీటి కాలువల అభివృద్ధి కోసం ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపాం. కాలువలను మెరుగుపరిచి సాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటాం. కొంత మంది కాలువల్లో చెత్త వేసేయడం, మురుగునీరు వదిలేయడంతో సాగునీరు ప్రవాహానికి ఇబ్బందులు తలెత్తాయి. సాగునీటి వనరుల అభివృద్ధిపై దృష్టి సారిస్తాం.

– వినయ్‌కుమార్, ఏఈ, నీటి పారుదల శాఖ

11న మునగపాకలో శూలాల మహోత్సవం



సాంబశివ శూలాల మహోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే విజయకుమార్

మునగపాక: ఈ నెల 11న మునగపాకలో జరగనున్న శూలాల మహోత్సవాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ కోరారు. ఈ మేరకు పోస్టర్‌ను సోమవారం మునగపాకలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తరాంధ్రలో పేరుగాంచిన శూలాల మహోత్సవాన్ని రాజకీయాలకు అతీతంగా జరుపుకోవాలన్నారు. పార్వతీ పరమేశ్వరులను దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలన్నారు. ఉత్సవ కమిటీ చైర్మన్ బూడిద శ్రీనివాసరావు, ఉత్సవ కమిటీ చైర్మన్ వేగి కృష్ణ, పెద్దలు టెక్కలి పరశురామ్, దాడి ముసిలినాయుడు, అలంక శ్రీను, బొడ్డేడ అప్పలనాయుడు, ఏవీ సత్యనారాయణ, దొడ్డి శ్రీనివాసరావు, సరస్వతి, కాలేశ్వరరావు, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఉపాధ్యాయుడు రామారావు ఎంపిక



రామారావును అభినందిస్తున్న తోటి ఉపాధ్యాయులు

ఎస్.రాయవరం: రాష్ట్ర స్థాయి క్రీడల్లో మండల ఉపాధ్యాయుడు రామారావు ప్రతిభ కనబరచడంపై పలువురు ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. ఎస్.రాయవరం బాలికల ఉన్నత పాఠశాలలో ఇంగ్లిషు టీచర్‌గా పని చేస్తున్న రామారావు విశాఖపట్నం పోలీస్ బ్యారెక్స్‌లో నిర్వహించిన పోటీల్లో 5కే వాకింగ్‌లో ప్రథమ స్థానం, 400 మీటర్ల రన్నింగ్‌లో ద్వితీయ స్థానం సాధించి, రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించారు. గుంటూరులో 14, 15 తేదీల్లో జరిగే రాష్ట్ర స్థాయిలో పోటీల్లో ఆయన పాల్గొననున్నట్టు రామారావు తెలిపారు. ఈ మేరకు ఆయనను పీఆర్‌టీయూ నాయకులు, తోటి ఉపాధ్యాయులు అభినందించారు.

కులమతాలకు అతీతంగా గ్రామాభివృద్ధికి కృషి



యాదవ సంక్షేమ సంఘానికి తీర్మానం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా మాజీ అధ్యక్షుడు ప్రసాద్

మునగపాక: కులమతాలకు అతీతంగా మునగపాక గ్రామాభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని వైఎస్సార్‌సీపీ జిల్లా మాజీ అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ కోరారు. మునగపాకలోని పరదేశమ్మ తల్లి గుడి ప్రాంగణంలో ఆదివారం రాత్రి యాదవ సంక్షేమ సంఘ సభ్యులతో సమావేశం నిర్వహించారు. పంచాయతీ ద్వారా సంఘానికి కేటాయించిన స్థలానికి తీర్మాన పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మునగపాకలో అన్ని కులాల వారికి పంచాయతీ సమ న్యాయం చేస్తూ ఆదర్శంగా నిలుస్తుందన్నారు. సంఘం అభివృద్ధికి తన వంతు సాయం అందజేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మునగపాక సర్పంచ్ దిమ్మల అప్పారావు, ఎం.సన్యాసిరావు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కోనపల్లి రామ్మోహనరావు, ఉత్సవ కమిటీ చైర్మన్ వేగి కృష్ణ, వార్డు సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల అధికారాలకు తూట్లు

- పంచాయతీ ప్రమేయం లేకుండా ఉపాధి పనులు
- ఎంపీడీవోకు సర్పంచ్‌ల ఫిర్యాదు



ఎంపీడీవో సీతారామరాజుకు ఫిర్యాదు చేస్తున్న సర్పంచ్‌లు, నాయకులు

నక్కపల్లి: కూటమి ప్రభుత్వం స్థానిక సంస్థల అధికారాలకు తూట్లు పొడుస్తోందని పలువురు సర్పంచ్‌లు ఆరోపించారు. ఈ మేరకు సోమవారం రాష్ట్ర కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు శీరం నర్సింహమూర్తి ఆధ్వర్యంలో పలువురు సర్పంచ్‌లు ఎంపీడీవో సీతారామరాజుకు ఫిర్యాదు చేశారు. రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో గ్రామాల్లో ఉపాధి హామీ పథకం నిధులతో చేపట్టబోయే పనులకు సర్పంచ్‌లు, పంచాయతీ పాలకవర్గం ఆమోదం లేకుండా మంజూరు చేయడం దారుణమన్నారు. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసే ఉపాధి హామీ నిధులపై రాష్ట్ర ప్రభుత్వం పెత్తనమేంటని వారు ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం ప్రతి పంచాయతీకి రూ.15లక్షలు విడుదల చేసిందని, ఈ నిధులతో గ్రామాల్లో సీసీ రోడ్లు, కాలువలు నిర్మించాలని ఆదేశించిందన్నారు. ఈ నిధులకు పంచాయతీల నుంచి కొంత మొత్తాన్ని మ్యాచింగ్ గ్రాంట్ కలపాలని సూచించిందన్నారు. అయితే ఈ పనుల ఎంపికలో సర్పంచ్‌లు, పంచాయతీ పాలకవర్గానికి తెలపకుండా వారి ఆమోదం లేకుండా టీడీపీ నాయకులు పనులు ఎంపిక చేసి శంకుస్థాపనలు చేస్తున్నారని ఆరోపించారు. అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ కూటమి నేతలు ప్రజలకు అవసరమైన చోట కాకుండా వారికి నచ్చిన ప్రాంతాల్లో పనులు చేపడుతూ పంచాయతీలను అగౌరవపరుస్తున్నారని ఆరోపించారు. ఇదే విధానం కొనసాగితే సర్పంచ్‌లంతా న్యాయ పోరాటం చేస్తారన్నారు. మ్యాచింగ్ గ్రాంట్ ఇచ్చే పరిస్థితి లేదన్నారు. రాష్ట్రంలో మెజార్టీ సర్పంచ్‌లు వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు ఉండటం వల్లే ఈ విధంగా వ్యవహరిస్తోందని దుయ్యబట్టారు. ఎంపీడీవోను కలిసిన వారిలో వైస్ ఎంపీపీలు వీసం నానాజీ, వెలగా ఈశ్వరరావు, సర్పంచ్‌లు పొడగట్ల వెంకటేష్, తళ్ల భార్గవ్, వెదుళ్ల పాపారావు, కోమర్తి చిట్టిబాబు, సాదిరెడ్డి శ్రీను, సిహెచ్.కొండలరావు, నర్సింహమూర్తి, అల్లు రమణ, నాగఅప్పలరాజు, నూకరత్నం, ఎంపీటీసీ సభ్యులు గంటా తిరుపతిరావు, గొర్ల గోవిందరావు, పొడగట్ల పాపారావు, తదితరులు ఉన్నారు.

జలసిరి బోరుతో నీటి వ్యాపారం

- నర్సాపురంలో టీడీపీ నేత నిర్వాకం
- తహసీల్దార్, ఎంపీడీవోలకు గ్రామస్తుల ఫిర్యాదు



తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న నర్సాపురం గ్రామస్తులు

నక్కపల్లి: గత టీడీపీ ప్రభుత్వ హయాంలో జలసిరి పథకం ద్వారా వ్యవసాయ అవసరాల కోసం బోరు మంజూరు చేయించుకుని, సదరు బోరు ద్వారా వచ్చే నీటితో వ్యాపారం చేస్తున్న టీడీపీ నాయకుడిపై చర్యలు తీసుకోవాలంటూ ఎస్.నర్సాపురం గ్రామస్తులు సోమవారం అధికారులకు ఫిర్యాదు చేశారు. గ్రామానికి చెందిన సర్పంచ్ పల్లా నాగరత్నం, వైఎస్సార్‌సీపీ నేత పల్లా చినఅబ్బాయి తదితరులు సోమవారం తహసీల్దార్ నర్సింహమూర్తి, ఎంపీడీవో సీతారామరాజులకు చేసిన ఫిర్యాదు వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు గట్టెం గణేష్ 2014లో టీడీపీ ప్రభుత్వ హయాంలో జలసిరి పథకం ద్వారా వ్యవసాయ బోరు మంజూరు చేయించుకున్నారన్నారు. పూర్తి సబ్సిడీతో మంజూరైన ఈ బోరు ద్వారా వచ్చే నీటిని కిలోమీటరు దూరంలో ఉన్న హెటిరో రసాయన పరిశ్రమలో పని చేసే సిబ్బంది నివాసం ఉండే వసతి గృహాలకు సరఫరా చేస్తున్నారని ఆరోపించారు. ఇలా వ్యవసాయ అవసరాల కోసం వినియోగించాల్సిన నీటిని నెలకు లక్ష రూపాయలకు పైగా విక్రయిస్తూ జలసిరి పథకాన్ని దుర్వినియోగం చేస్తున్నారన్నారు. ఇది వాల్టా చట్టం ఉల్లంఘన కిందకు వస్తుందన్నారు. తక్షణమే అతనిపై చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులకు ఫిర్యాదు చేసిన వారిలో పి.వెంకన్న, బాబూరావు, వీరయ్య, లోవరాజు, చక్రరావు, కాశీబాబు, నాగరాజు, దుర్గ, తదితరులు ఉన్నారు.

గ్రామాల అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయకుమార్

మునగపాక: ప్రజా ప్రతినిధులు గ్రామాల అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ కోరారు. మునగపాక మండల పరిషత్ హాలులో సోమవారం ఎంపీపీ మళ్ల జయలక్ష్మి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేసి మండలానికి పేరు తీసుకురావాలన్నారు. ప్రభుత్వ భూముల ఆక్రమణలపై దృష్టి సారించాలన్నారు. గంజాయి రవాణా నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాల్లో జరిగే అభివృద్ధి పనులకు సర్పంచ్‌లు సహకరించాలన్నారు. జలజీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికీ తాగునీరు అందించడమే లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు. సర్పంచ్‌ల ప్రమేయం లేకుండా వెండర్లను ఎలా నియమిస్తారని వెంకటాపురం సర్పంచ్ తాతాజీ సభ దృష్టికి తీసుకువచ్చారు. వాడ్రాపల్లి ఆవను అభివృద్ధి చేయాలని సర్పంచ్ నూకరాజు కోరారు. టి.సిరసపల్లి ప్రాథమిక పాఠశాల ప్రహరీ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని సర్పంచ్ మద్దాల ధనలక్ష్మి కోరారు. జెడ్పీటీసీ సభ్యుడు పెంటకోట స్వామి సత్యనారాయణ మాట్లాడుతూ రాత్రి వేళ కొంత మంది ఆకతాయిలు తిరగడంతో పాటు గంజాయి వంటి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్నారన్నారు. అనంతరం అధికారులు శాఖలవారీగా తమ నివేదికను చదివి వినిపించారు. ఎంపీడీవో ఎం.ఉషారాణి, తహసీల్దార్ ఎస్.ఆదిమహేశ్వరరావు, వైస్ ఎంపీపీలు బోజా లక్ష్మి, చిందాడ దేవి, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు సమావేశంలో పాల్గొన్నారు.

హరహర మహాదేవ

- భక్తులతో పోటెత్తిన శివాలయాలు
- భక్తిశ్రద్ధలతో తొలి సోమవారం పూజలు



ఉపమాక శివాలయానికి తరలివచ్చిన భక్తులు



కోటవురట్ల శివాలయంలో అభిషేకంలో పాల్గొన్న భక్తులు



మునగపాక లింగరాయి గుడిలో పూజలు చేస్తున్న భక్తులు



కొత్తపేట ఉమారామలింగేశ్వరస్వామి ఆలయంలో అభిషేకాలకు హాజరైన భక్తులు



గెడ్డపాలెం చంద్రమౌళేశ్వరస్వామి ఆలయంలో అభిషేకాలు నిర్వహిస్తున్న భక్తులు



పట్టణంలోని కాశీవిశ్వేశ్వర త్రిమూర్తుల ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

నక్కపల్లి: కార్తీక మాసం మొదటి సోమవారం కావడంతో శివాలయాలకు భక్తులు పోటెత్తారు. ఓం నమశ్శివాయ అనే పంచాక్షరీ మంత్రాన్ని పఠిస్తూ బోళా శంకరుడ్ని దర్శించుకున్నారు. ఉపమాకలో లక్ష్మణేశ్వర స్వామి ఆలయం, ఒడ్డిమెట్టలో కాశీవిశ్వేశ్వరాలయం, గొడిచర్లలో శేషలింగేశ్వరాలయాల్లో భక్తుల తాకిడి ఎక్కువగా ఉంది. శివాలయాల్లో తెల్లవారుజామున 3 గంటల నుంచే ప్రత్యేక రుద్రాభిషేకాలు నిర్వహించారు. నామవరంలోని స్వయంభూ రామలింగేశ్వరాలయానికి చుట్టు పక్కల ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. ఈ సందర్భంగా అన్నసమారాధన నిర్వహించారు. ఆలయాల వద్ద ఉన్న ధ్వజ స్తంభాలు, నవగ్రహాల వద్ద దీపారాధన చేశారు.

ఎస్.రాయవరం: మండలంలోని పెదఉప్పలం బ్రహ్మలింగేశ్వరస్వామి, పెదగుమ్ములూరు కాశీ ఉమాలింగేశ్వరస్వామి, ఎస్.రాయవరం బుద్రేశ్వరస్వామి, గెడ్డపాలెం చంద్రమౌళీశ్వరస్వామి, సర్వసిద్ధి సిద్ధిలింగేశ్వరస్వామి, వేమగిరి కాశీవిశ్వేశ్వరస్వామి తదితర ఆలయాల్లో కార్తీక మాస పూజలు నిర్వహించారు. దీంతో శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

కోటవురట్ల: కార్తీక మాసం తొలి సోమవారాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. ఈ సందర్భంగా శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. శివనామస్మరణతో హోరెత్తాయి. వరాహ, సర్పానదుల్లో స్నానాలు ఆచరించి ఆలయాలలో పూజలు చేశారు. మండలం కేంద్రంలో ఉమారామలింగేశ్వరస్వామి ఆలయం, చిన లింగాపురంలో దుర్గా మల్లేశ్వర అయ్యప్ప ఆలయం, జల్లూరు శివారు ఆత్మలింగేశ్వరస్వామి ఆలయాలలో ప్రత్యేక పూజలు చేశారు.

మునగపాక: మండలంలోని పలు శివాలయాలు శివనామస్మరణతో మార్మోగాయి. కార్తీక మాసం తొలిసోమవారం కావడంతో ఆలయాలు భక్తులతో కళకళలాడాయి. వాడ్రాపల్లిలోని దక్షిణేశ్వరుని ఆలయం ఉదయం నుంచి కిటకిటలాడింది. మునగపాక మెయిన్‌రోడ్డులోని లింగరాయిగుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాంబశివుని ఆలయంతో పాటు నాగులాపల్లిలోని పురాతన శివాలయాలకు భక్తుల తాకిడి పెరిగింది. మునగపాక సాంబశివుని సన్నిధిలో పలువురు భక్తులు గురుస్వామి మాడెం జోగారావు ఆధ్వర్యంలో శివమాలలు ధరించారు.

యలమంచిలి రూరల్: పట్టణంలోని కాశీవిశ్వేశ్వర త్రిమూర్తులుస్వామి, కొత్తపేట పురాతన ఉమాధర్మలింగేశ్వర స్వామి, బైపాసు రోడ్డు సోమస్కంధమూర్తి, శేషుగెడ్డ శివాలయాలకు సోమవారం ఉదయం నుంచే భక్తులు పోటెత్తారు. మండలంలోని ఏటికొప్పాక, సోమలింగపాలెం, జంపపాలెం, కొక్కిరాపల్లి, పులపర్తి, తెరువుపల్లి గ్రామాల్లోని ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ధ్వజ స్తంభాల వద్ద మహిళలు నూనె దీపాలను వెలిగించారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

అనకాపల్లి: అనకాపల్లి సేల్స్ అండ్ సర్వీసెస్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా వేగి అజయ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక న్యూకాలనీ రోటరీ కల్యాణ మండపంలో సోమవారం అసోసియేషన్ ఎన్నికలు జరిగాయి. సంఘ గౌరవాధ్యక్షుడిగా శిలపరశెట్టి ప్రసాద్‌బాబు, కార్యదర్శిగా మహమ్మద్ ఆలీ, కోశాధికారిగా ప్రసాద్, ఉపాధ్యక్షుడిగా వి.రాజేష్‌రావు, వి.గోపి, సహాయ కార్యదర్శులుగా ఎస్.పవన్‌రాజ్, జె.సంతోష్, కమిటీ సభ్యులుగా జి.నూకరాజు, ఎ.కుమార్, సాయి, హర్ష, శేష ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రెండేళ్ల పాటు నూతన కార్యవర్గం ఉంటుందని గౌరవాధ్యక్షుడు ప్రసాద్‌బాబు తెలిపారు.

అభిజిత్ విషయంలో ప్రభుత్వ వైఖరేమిటి?



ధర్నాను ఉద్దేశించి మాట్లాడుతూ సీఐటీయూ రాష్ట్ర కమిటీ నాయకుడు గనిశెట్టి సత్యనారాయణ

అచ్యుతాపురం: అభిజిత్ కంపెనీ అక్రమంగా లే-ఆఫ్ ప్రకటిస్తే రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు గనిశెట్టి సత్యనారాయణ ప్రశ్నించారు. అచ్యుతాపురం సెజ్‌లోని అభిజిత్ కంపెనీని మూసివేయడాన్ని నిరసిస్తూ సోమవారం చేపట్టిన ధర్నానుద్దేశించి ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల పక్షానా ఉంటుందా.? లేక యాజమాన్యం వైపు ఉంటుందా? తేల్చుకోవాలని నిలదీశారు. కర్మాగారాన్ని వెంటనే తెరిపించి కార్మికుల బకాయి జీతాలు, బోనస్ చెల్లించాలని డిమాండ్ చేశారు. రెండు రోజుల్లో అభిజిత్ సమస్యను పరిష్కరించకుంటే అచ్యుతాపురంను దిగ్బంధిస్తామని హెచ్చరించారు. కమ్యూనిస్టు నాయకుల పట్ల ఎమ్మెల్యే విజయకుమార్ అవలంబిస్తున్న వైఖరిని గనిశెట్టి ఖండించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకుడు ఆర్.రాము, అభిజిత్ కార్మికులు పాల్గొన్నారు.

రిమ్‌జిమ్ వేడుకలు ప్రారంభం



సంప్రదాయ, విచిత్ర వేషధారణలతో వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు

పాయకరావుపేట: స్థానిక శ్రీప్రకాష్ విద్యా సంస్థలో రిమ్‌జిమ్-2024 వేడుకలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. తుని, పాయకరావుపేట, అన్నవరం శాఖల విద్యార్థులు సుమారు 4500 మంది ఈ వేడుకల్లో పాల్గొననున్నారు. రిమ్‌జిమ్ కార్యక్రమంలో సాహిత్యం, సంగీతం, ఆటలు, క్రీడలు, లలిత కళలు, థియేటర్ ఆర్ట్స్ అండ్ సైన్స్ వంటి అనేక అంశాలపై జూనియర్, సబ్ జూనియర్స్, సీనియర్స్, సూపర్ సీనియర్స్ విభాగాలలో 29 రకాల పోటీలు నిర్వహిస్తామని విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సిహెచ్.విజయ్ ప్రకాష్ తెలిపారు. ఈ రిమ్‌జిమ్ కార్యక్రమం ఈ నెల 9వ తేదీ వరకు నిర్వహిస్తామన్నారు.